సాక్షి మంచిర్యాల

సోమవారం, 11, నవంబర్, 2024



ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

బెల్లంపల్లి, నిర్మల్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. 8లో▸

అబాకస్‌లో ప్రతిభ



అద్విక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన నామని వెంకట అద్విక కోల్‌కత్తాలో జరుగుతున్న ఎస్ఐపీ అబాకస్ ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికైంది. కర్ణాటకలో ఆదివారం నిర్వహించిన అబాకస్ పోటీల్లో లెవల్ 6లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /21.1

పొద్దంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రతీ కుటుంబం వివరాలు సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోటపల్లి/చెన్నూర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ప్రతీ కుటుంబం వివరాలు తప్పనిసరిగా సేకరించాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అధి కారులకు సూచించారు. కోటపల్లి మండలం మల్లంపేట, కోటపల్లిలో, చెన్నూర్ మండలం కత్తరసాల గ్రామంలో సర్వేను ఆదివారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్వే మొదలు పెట్టామన్నారు. ప్రభుత్వ విధివిధానాల ప్రకారం అన్ని కుటుంబాల వివరాలు తీసుకోవాలన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి కుటుంబాల సమాచారం ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. కుటుంబాల సమాచారం ప్రతీ పథకానికి.. భవిష్యత్తులో చేపట్టనున్న ప్రణాళికలకు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి పురుషోత్తంనాయక్, ఎంపీడీవోలు సత్యనారాయణ, మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ఆర్ఐ రంజిత్ పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి



వాల్‌పోస్టర్‌లు విడుదల చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: భారత కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జె.పరశురాం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో జంతర్‌మంతర్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ కృషితోనే 1935 ఏప్రిల్ 01న రిజర్వ్ బ్యాంకు ఏర్పాటైందన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఢిల్లీలో మహాధర్నా తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సలహాదారు పలిగిరి కనకరాజు, జిల్లా నాయకులు దేవి సత్యం, మొయ్య రాంబాబు, రాచర్ల సురేశ్, దేవి పోశన్న, రాంచందర్, ఐత పరమేశ్, కడారి రమేశ్, కన్నూరి రాజేందర్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: ప్రజాసమస్యలపై పోరాడి పరిష్కార మార్గాలు చూపిన మొట్టమొదటి పార్టీ సీపీఐ అని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26కు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీ ఖాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, రేగుంట చంద్రశేఖర్, పూర్ణిమ, రేగుంట చంద్రకళ, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు మెడల్స్ అందజేత



మెడల్స్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అభినందించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. గ్రూప్ ఈవెంట్‌లో మెడల్స్ సాధించారు. ఈ క్రీడాకారులకు ఎమ్మెల్యే మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా సెక్రెటరీ ఆవునూరి మహేశ్ పాల్గొన్నారు.

కావాలి.. టూటౌన్!



మంచిర్యాల పోలీస్ స్టేషన్

- వేగంగా విస్తరిస్తున్న మంచిర్యాల పట్టణం
- అంతకన్నా వేగంగా పెరుగుతున్న నేరాలు
- ఒకే ఠాణా, సరిపడా సిబ్బంది లేక ఇబ్బంది
- ఉన్న వారిపైనే అదనపు భారం
- ప్రతిపాదనలకే పరిమితమైన రెండో ఠాణా

నాలుగేళ్లుగా మంచిర్యాల ఠాణాలో నమోదవుతున్న కేసులు..

సంవత్సరం	కేసులు
2020	538
2021	601
2022	540
2023	841
2024	(అక్టోబర్ వరకు 550)

మంచిర్యాలక్రైం: సాధారణంగా మండలాల్లో మనకు ఒకే పోలీస్ స్టేషన్ ఉంటుంది. మండల పరిధి మొత్తం ఆ ఠాణా పరిధిలోకే వస్తుంది. ఇక పట్టణాల్లో.. వన్ టౌన్, టూటౌన్, త్రీ టౌన్.. అంటూ పోలీస్ స్టేషన్లు కనిపిస్తాయి. పట్టణాల పరిధి, జనాభా ఎక్కువగా ఉండడం, నేరాలు ఎక్కువగా జరగడం వంటి కారణాలతో ప్రభుత్వం పట్టణాల్లో ఠాణాలు ఏర్పాటు చేస్తుంది. మంచిర్యాల పట్టణంలో కూడా రెండో ఠాణా ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నారు. ఈమేరకు ప్రతిపాదనలు కూడా పంపించారు. కానీ, కార్యరూపం దాల్చడం లేదు. మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారడంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణ పరిధి కూడా పెరుగుతోంది. శివారు ప్రాంతాల్లో నిర్మాణాలు, నివాసాలు పెరుగుతున్నాయి. అంతకన్నా వేగంగా జిల్లా కేంద్రంలో నేరాలూ పెరుగుతున్నాయి. అయినా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రెండో ఠాణా ప్రతిపాదనకు మోక్షం కలగడం లేదు.

1.50 లక్షల జనాభా..

మంచిర్యాల పట్టణంలో 1.50 లక్షల జనాభా ఉంది. ఇంత జానాభాకు ఒకే ఠాణా ఉంది. ఏడాదికి సుమారు 600 వరకు కేసులు నమోదవుతున్నాయి. మండల కేంద్రాల్లో ఉండే పోలీస్ స్టేషన్లలో ఏటా 100 నుంచి 200 కేసులు నమోదవుతాయి. పట్టణంలోని పోలీస్ స్టేషన్లలో 300 నుంచి 400 వరకు కేసులు నమోదవుతాయి. మంచిర్యాలలో మాత్రం 600 వరకు కేసులు నమోదవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్‌లో రెండు ఠాణాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోనూ రెండు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 50 వేల జనాభా మాత్రమే ఉంది. ఏటా సగటున 350 కేసులు నమోదవుతున్నాయి. మంచిర్యాల పక్కనే ఉన్న నస్పూర్ మున్సిపాలిటీలోనూ రెండు పోలీస్‌స్టేషన్లు (నస్పూర్, శ్రీరాంపూర్) ఉన్నాయి. వీటి పరిధిలో 65 వేల జనాభా ఉంది. ఒక్కో ఠాణాలో సగటున 350 కేసులు నమోదవుతున్నాయి.

మూడు సబ్ డివిజన్లు...

జిల్లాలో బెల్లంపెల్లి, జైపూర్, మంచిర్యాల మూడు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 25 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ మంచిర్యాల సబ్ డివిజన్ పరిధిలోకి రాగా, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ జైపూర్ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఇవి రెండూ ఒకే మున్సిపాలిటీలో ఉండడం గమనార్హం. వేర్వేరు సర్కిళ్లు, వేర్వేరు డివిజన్ల పరిధిలో ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నేరాలు ఎక్కువ..

మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీల పరిధిలో నేరాలు తక్కువ. కేసులు కూడా 350 వరకు మాత్రమే నమోదవుతాయి. మంచిర్యాలలో 600 వరకు కేసులు నమోదువుతున్నా యి. అయినా ఒకే ఠాణాతో నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. 50 వేల జనాభా ప్రాతిపదికన చూస్తే మంచిర్యాలలో టూటౌన్, త్రీటౌన్ ఏర్పాటు చేయాలి. కానీ, ఒకే ఠాణాతో శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సి రావడంతో ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది. సిబ్బంది కొరతతో అదనపు పనులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. డయల్ 100 కాల్స్‌పై స్పందించినా.. ఘటన స్థలానికి చేరుకోవడం ఆలస్యం అవుతోంది. మరో ఠాణా ఏర్పాటు చేస్తే సిబ్బందిపై భారం తగ్గుతుందని, పోలీసులకు సత్వర సేవలు అందుతాయని పేర్కొంటున్నారు. ఈమేరకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు.

మంచిర్యాలలో పరిస్థితి ఇదీ..

మంచిర్యాల జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ భూ వివాదాలు, సివిల్ తగదాలు, చిన్నచిన్న గొడవలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, గ్యాంగ్ వార్‌లు పెరిగాయి. మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఏడాదికి 600 వరకు కేసులు నమోదవుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఉన్నా ఫ్యామిలీ కేసులు చూస్తున్నాయి. మిగిలిన కేసులన్నీ పట్టణ ఠాణా పరిధిలోకే వస్తాయి. ఈ ఠాణాలో ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 45 మంది కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. రోజుకు 20 నుంచి 30 వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. 20 వరకు కేసులు నమోదవుతున్నాయి. జనాభా ఎక్కువ, కేసులు నమోదు సంఖ్య ఎక్కువ, వీఐపీల తాకిడీ ఎక్కువగా మంచిర్యాల ఠాణా పరిధిలోనే ఉంటుంది. ఇందులో కొందరు కోర్టు డ్యూటీ, గన్‌మెన్లు, బ్లూకోల్ట్స్, రైటర్లుగా విధులు నిర్వహిస్తున్నవారు 25 మంది ఉండగా మిగిలిన వారు శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్నారు.

- పోలీస్ స్టేషన్ పరిధి...
- మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధి 48.5 చదరపు కి.మీలు
- మున్సిపల్ వార్డులు 36
- గ్రామ పంచాయతీ 01(హాజీపూర్ మండలంలోని ర్యాలీ ఘడ్‌పూర్)
- జనాభా 1.50 లక్షలు

పల్లె పోరుపై సందిగ్ధం!

- ఈ ఏడాది పంచాయతీ ఎన్నికలు కష్టమే
- రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే
- రెండు నెలలపాటు కొనసాగే అవకాశం
- ఆ తర్వాతే రిజర్వేషన్ల ఖరారు..



మంచిర్యాల జిల్లా పరిషత్ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ ఎన్ని కలు ఈ ఏడాది నిర్వహించే పరిస్థితులు కనిపించడం లేదు. పార్లమెంటు ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం హడావుడి చేసినా ప్రక్రియ ముందుకు సాగలేదు. బీసీ కులగణన అంశం ముందుకు రావడంతో స్థానిక ఎన్నికల నిర్వహణకు చొరవ చూపలేదు. ప్రస్తుతం బీసీ కుల గణన కు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయగా రాష్ట్రంలో కుల గణనతోపాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈ ప్ర క్రియ ముగియడానికి రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. అంటే డిసెంబర్ వరకు సమగ్ర కుటుంబ సర్వే ఉండటంతో ఈ ఏడాది పంచాయతీ ఎన్నికలతోపాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు లేనట్లే కనిపిస్తోంది.

సమగ్ర కుటుంబ సర్వే కోసం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ కోసం జీవో 13 విడుదల చేసింది. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి తదితర 56 ప్రశ్నాలతోపాటు అనుసంధానంగా ఉన్న మరో 19 ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించి వివరాలను సైతం కుటుంబ సభ్యుల నుంచి సేకరించి ఆ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్నారు.

9 నెలలుగా 'ప్రత్యేక' పాలన..

2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 2వ తేదీన పాలకవర్గాలు కొలువుదీరాయి. ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన సాగుతోంది. ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమై 9 నెలలు గడిచింది. ఇప్పటికే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాప్యం జరిగింది. ఎన్నికల తర్వాత బీసీ కుల గణన తర్వాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిడి రావడంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు.

రెండు నెలలు సర్వే..

ప్రస్తుతం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసేలా ప్రణాళిక తయారు చేసింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ కూడా చేపట్టాల్సి ఉంది. ఇటు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతోపాటు రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తి చేస్తే త ప్ప ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం లేదు.

వచ్చే ఏడాది ఎన్నికలు..

2025 జనవరిలో సర్పంచ్ ఆ తర్వాత జిల్లా, మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికల నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు అప్పటికే మున్సి పల్ పాలకవర్గాల పదవీ కాలం కూడా పూర్తవ్వనున్నందున ప్రభుత్వం వరసగా ఎన్నికల నిర్వహణకు కార్యచరణ చేయనున్నట్లు తెలుస్తోంది.

సర్పంచులు	ఎంపీటీసీలు	ఎంపీపీలు	జెడ్పీటీసీలు	వార్డులు	ఓటర్లు
311	130	16	16	2,730	3,78,934

వైభవంగా భీమన్న రథోత్సవం



అలంకరించిన రథాలు

నెన్నెల: మండలంలోని మన్నెగూడెం భీమన్న దేవుడి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమన్న ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి రథంలో ఉంచి గుడిచుట్టూ ప్రదక్షిణ చేయించారు. భక్తులు మేకలు, కోళ్లను స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల మంది తరలిరావడంతో మన్నెగూడెం కిటకిటలాడింది. 15 ఏళ్ల క్రితం నిర్వహించిన రథోత్సవం తిరిగి ఆదివారం నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు



భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- నస్పూర్‌లో ఐటీఐ, ఏటీసీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన


నస్పూర్: నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు వెలికితీసి వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. నస్పూర్ శివారులో ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ భవన నిర్మాణ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆదివారం భూమి పూజ చేశారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఇక్కడే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. పట్టణంలోని డంప్‌యార్డులో చెత్తను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారని, విచారణ జరిపి నిందితులను గుర్తించి వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. సింగరేణి స్థలంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలకు సంబంధించిన డంప్‌యార్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్ ఇండియా స్కీంలో భాగంగా ఐటీఐ, ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. మంచిర్యాల ఐటీఐని అప్‌గ్రేడ్ చేస్తామన్నా రు. డిమాండ్ ఉన్న కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, ఐటీఐ ప్రిన్సిపాల్ సుజాత, పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానం

లక్సెట్టిపేట: విద్య ఉన్నత స్థానంలో నిలబెడుతుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీకి కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలోనే భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మ సంతోష్, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్,

దోపిడీ ఉన్నంతకాలం.. ఉద్యమాలు

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టి.శ్రీనివాస్



ఐక్యత చాటుతున్న నాయకులు

పాతమంచిర్యాల: సమాజంలో దోపిడీ ఉన్నంతకాలం విప్లవోద్యమాలు ఉంటాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో అమరవీరుల సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం అనేక మంది కమ్యూనిస్టులు, విప్లవకారులు, ఉద్యమకారులు ప్రాణాలు త్యాగాలు చేశారన్నారు. నవంబర్ మాసంలోనే ఎక్కువ మంది ఉద్యమకారులు మృతి చెందడంతో నవంబర్ 01 నుంచి 10 వరకు సంస్మరణ సభను ఏటా నిర్వహిస్తున్నామన్నారు. అమరుల ఆదర్శాలను, స్ఫూర్తిని నింపుకుని భవిష్యత్ కార్యచరణకు పార్టీ పూనుకుంటుందన్నారు. ఈ సందర్భంగా అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మేకల రామన్న, బ్రహ్మానందం, దొండ ప్రభాకర్, మల్లన్న, టీ. శ్రీనివాస్, ఆర్.తిరుపతి, డి.శ్రీకాంత్, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ కుమార్ దీపక్



నంబాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే..

దండేపల్లి/లక్సెట్టిపేట: రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. దండేపల్లి మండలం నంబాలలో ఐకేపీ ఆధ్వర్యంలో, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మండలానికి రైస్ మిల్ మంజూరు చేసి దానిని కూడా మహిళా సంఘాలకే అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల ప్రారంభం..

దండేపల్లి మండలం కన్నెపల్లి శ్రీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రారంభించారు. సీసీఐలోనే పత్తి రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు.

కోతకు రాని పైరును కోయవద్దు



వరి పైరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వేమనపల్లి: కోతకు రాని వరిపైరును కోయవద్దని అదనపు కలెక్టర్ మోతిలాల్ రైతులకు సూచించారు. వేమనపల్లి మండలంలో కుల గణన సర్వేను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం దారిలోని వరిపైరు కోస్తున్న హార్వెస్టర్‌ను చూసి అక్కడికి వెళ్లారు. వేమనపల్లికి చెందిన కుర్సింగ అంజన్న అనే రైతు పంట కోతకు రాకముందే కోయించడంతో యజమానిని పిలిచి మాట్లాడారు. దోమపోటు, వర్షాలకు పంట వాలిపోయే ప్రమాదం ఉండడంతో కోయిస్తున్నట్లు రైతు తెలిపాడు. కోతకు రాని పైరును కోయించవద్దని నచ్చజెప్పారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ పీఆర్సీ, డీఏ బిల్లులు వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల ద్వారా సమస్యను అసెంబ్లీ వేదికగాప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరంచాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోనివారు ఈనెల 23వ తేదీ నుంచి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా సైక్లింగ్



సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న లక్సెట్టిపేట రేంజ్ అటవీ అధికారి సుభాష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ఎంసీసీ క్వారీ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్‌పై ఆదివారం ఔత్సాహికులు సైక్లింగ్ చేశారు. లక్సెట్టిపేట రేంజ్ అటవీ అధికారి సుభాష్ సైక్లింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని హాజీపూర్ మండలం ధర్మారం, గుడిపేట, నంనూర్, ముల్కల్ల పాతమంచిర్యాల, గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ అటవీ ప్రాంతంలోకి పులులు వచ్చేలా, స్థిర నివాసం ఏర్పరచుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పులుల రక్షణలో భాగంగా నీటి అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణ కోసం చేస్తున్న పనులను వివరించడం అడవిలో సైకిల్ సవారీ చేపట్టినట్లు తెలిపారు. అడవులను ప్లాస్టిక్ రహితం చేస్తూ వన్యప్రాణులకు బయటి ఆహారం అందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ అధికారులకు అవగాహన కల్పించారు. ఇటీవల హాజీపూర్, మేడారం, బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని ముత్యంపల్లి ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోందని దీని ఆవాసం కోసం ఏర్పాట్లు చేసేలా అధికార యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. సైక్లింగ్‌లో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, డాక్టర్ రఘువాహి, ప్రకృతి ప్రేమికులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రమౌళి, లక్సెట్టిపేట డెప్యూటీ రేంజ్ అధికారి హఫీజొద్దీన్, ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్‌వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానసికస్థితి సరిగా లేక వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సాయికుమార్



వినోద్ (ఫైల్)

పెంబి: మానసిక స్థితి సరిగా లేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన నముల్ల చిలుకవ్వ–లచ్చన్న దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు నముల్ల వినోద్(27) చిన్నప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. ఎలాంటి పనులు చేయడం లేదు. ఈక్రమంలో మనస్తాపం చెందాడు. శుక్రవారం తన పొలానికి వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. తల్లి చిలుకవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

ఉరేసుకుని ఒకరు..



రాములు(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని భైల్‌బజార్ ప్రాంతానికి చెందిన బంటోల్ల రాములు(38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..రాములు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటున్నాడు. కొన్నేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో తలకు గాయమై అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం భార్య సంగీత కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా స్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు..



సంతోష్ (ఫైల్)

దిలావర్‌పూర్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన మస్త సంతోష్ (37)కు లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామానికి చెందిన స్వప్నతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. కుమారుడిని తీసుకుని భార్య కొన్నిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో భర్త మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. గ్రామానికి ఆనుకుని ఉన్న పంటచేలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. అక్కడ రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 12, 13వ తేదీల్లో వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు అశోక్, నగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఆదివాసీ యువకుల క్రీడా నైపుణ్యాలను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, సాయంత్రం 5 గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



మెదక్ జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ, డీఐఈవో

- సాఫ్ట్‌బాల్ బాల, బాలికల్లో మెదక్, నిజామాబాద్ జట్ల జయకేతనం
- హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్‌లు
- విజేతలకు బహుమతుల ప్రదానం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా రెండు రోజుల పాటు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సింగరేణి తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 9 బాలుర, 9 బాలికల జట్లు హాజరయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. నువ్వా నేనా అనేరీతిలో క్రీడాకారులు పోటీపడగా బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు, తృతీయస్థానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు (ద్వితీయ), మహబూబ్‌నగర్ జిల్లా జట్టు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.



నిజామాబాద్ జిల్లా జట్టుకు బహుమతి ఇస్తున్న ఏసీపీ, డీఐఈవో

సత్తాచాటిన మెదక్, నిజామాబాద్ జిల్లాల జట్లు..

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల జట్లు సత్తాచాటాయి. ఆది నుంచి ఆ రెండు జిల్లాల జట్లు పట్టుదలతో ఆడాయి. ఉమ్మడి మెదక్ జిల్లా బాలుర జట్టు పట్టు వీడకుండా ఆడి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, అదే జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రత్యర్థి జట్టుతో తలపడి ద్వితీయ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు హోరాహోరీగా తలపడి ప్రథమస్థానాన్ని దక్కించుకోగా, అదే జిల్లాకు చెందిన బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తాచాటింది. ఈ పోటీల్లో మెదక్, నిజామాబాద్ జిల్లాల బాల,బాలికల జట్లు రెండేసి బహుమతులు దక్కించుకున్నాయి.

బహుమతుల ప్రదానం

తిలక్ స్టేడియంలో పోటీలు నిర్వహించగా పక్కనే ఉన్న బజారుఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతల జట్లకు ప్రదానోత్సవం జరిగింది. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, డీఐఈవో కె.అంజయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, తాండూర్ సీఐ కుమారస్వామిలు గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. సత్తా చాటిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా పోటీల పరిశీలకులు పీడీ గంగామోహన్, శంకరయ్య, కన్వీనర్ ఆదిలాబాద్ జిల్లా పీడీఎస్ స్వామి, ఉమ్మడి జిల్లా అండర్–19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరి బాబురావు, నిర్వాహకులు రామ్మోహన్‌రావు, ఎండీ యాకూబ్, బండి రవి, ఎండీ చాంద్‌పాషా, ఎస్‌కే రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, చిన్నక్క, యాదగిరి పాల్గొన్నారు.



ట్రెడిషనల్ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు



ఫాస్ట్‌–5 బాలికల విభాగంలో గెలుపొందిన నల్గొండ జట్టు

నిర్మల్‌లో నెట్‌బాల్ పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–16 సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫాస్ట్–5, ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి 48 జట్లు, 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్ ట్రెడిషనల్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్–నారాయణపేట్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందింది. ఫాస్ట్‌–5 ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కరీంనగర్ జట్టును ఓడించి నారాయణపేట్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్–నల్గొండ జట్లు తలపడగా నల్గొండ జట్టు జయకేతనం ఎగురవేసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ప్రముఖ వైద్యుడు అవినాష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. నెట్‌బాల్ రాష్ట్ర సెక్రెటరీ ఖాజాఖాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, సెక్రెటరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భోజన్న, డాక్టర్ వేదవ్యాస్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు జమున, అన్నపూర్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పర్సును అప్పగిస్తున్న అంజద్

నస్పూర్: పర్సు పోగొట్టుకున్న మహిళకు యువకుడు అప్పగించాడు. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన సత్తమ్మ ఆదివారం సీసీసీ కార్నర్ వద్ద గల ఎస్బీఐ ఏటీఎం వద్దకు వెళ్లింది. నగదు విత్‌డ్రా చేసుకుని వెళ్తుండగా పర్సు అక్కడే పడిపోయింది. సీసీసీకి చెందిన అంజద్ ఏటీఎం వద్దకు వెళ్లగా దొరికింది. కొంతసేపటికి సత్తమ్మ రావడంతో తిరిగి పర్సు అప్పగించాడు. పర్సులో రూ.700 నగదు, రెండు బంగారు పుస్తెలు ఉన్నాయని తెలిపింది.

పారిపోయిన ‘ఆశ్రమ’ విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పారిపోయారు. ఆదివారం ఎస్టీ హాస్టల్ నుంచి పారిపోయి బస్టాండ్‌కు చేరుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది చౌహాన్ కృష్ణ, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. 3, 6వ తరగతి చదువుతున్న వినీత్, వినాయక్, నితీశ్‌లను ఉపాధ్యాయులకు అప్పగించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో విద్యార్థులు బయటికి వెళ్లినట్లు తెలిసింది.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- టీయూటీఎఫ్ రాష్ట్ర విద్యా మహాసభలు



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీలో ఆదివారం టీయూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. జీవో 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అసెంబ్లీతోపాటు పార్లమెంట్‌లో వారి సమస్యలపై ప్రస్తావిస్తామని తెలిపారు. సమాజంలో టీచర్ల పాత్ర కీలకమని, విద్యను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధికి ఆటంకం ఎదురవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించింది రూ.21 వేల కోట్లు అని, ఇందులో ఇప్పటివరకు రూ.380 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కమీషన్లు వచ్చే వివిధ సర్వేలకు ప్రైవేట్ వ్యక్తులను కేటాయించిన సర్కారు, ఎలాంటి లాభాలు లేని వాటికి టీచర్లతో సర్వే చేయిస్తుందన్నారు. గత సీఎం కేసీఆర్ విద్యారంగంపై ఒక్కరోజు సమీక్ష నిర్వహించలేదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లచ్చిరాం, రఘునందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు ఉన్న ఐదు డీఏలకు గాను ఒక డీఏను మాత్రమే ప్రకటించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే క్లియరెన్స్ చేయాలన్నారు. సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఎంఈవో, డైట్ లెక్చరర్, డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డీఈవో ప్రణీత, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మొగలయ్య, బేర దేవన్న, మురళిమనోహర్ రెడ్డి, సుజాత, కైలాసం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 29 ఏళ్ల తర్వాత వీరందరు పాఠశాలలో ఆదివారం జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తీపి గుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



మందమర్రిలో..

మందమర్రిరూరల్: మందమర్రిలోని విజ్ఞాన్ స్కూల్‌లో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో జరిగిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చిన్ననాటి స్మృతులు గుర్తుచేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానం చేశారు.

వ్యాపారులు, లారీ ఓనర్స్ మధ్య లొల్లి

- లోకల్ లారీల్లోనే లోడ్ చేయాలని చెబుతున్న లారీ ఓనర్స్
- అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: జిన్నింగ్ వ్యాపారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ మధ్య లొల్లి జరుగుతోంది. స్థానికంగా ఉన్న లారీల్లోనే పత్తి బేళ్లను లోడ్ చేయాలని చెబుతూ లారీ ఓనర్స్ అడ్డుకుంటున్నారని ప్రైవేట్ వ్యాపారులు చెబుతున్నారు. తమకు ఇతర రాష్ట్రాల లారీల యజమానులు తక్కువ ధరకు లోడ్ చేస్తుండగా, జిల్లా కేంద్రానికి చెందిన లారీ ఓనర్లు అధిక ధరతో లోడ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే, ఈ విషయం వారి మధ్య గొడవకు దారితీస్తోంది. తమకు ఎవరు తక్కువ ధరకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తే వారికే లోడ్ చేస్తామని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. లోడ్ చేసిన లారీలను అడ్డుకోవడం సరికాదని పేర్కొంటున్నారు. గత మూడేళ్లగా ఈవిధంగా చేస్తున్నారని జిన్నింగ్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులతో ఆదివారం జిల్లా కేంద్రంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ వ్యాపారులు మాట్లాడుతూ గుంటూరుకు పత్తి బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన లారీల యజమానులు రూ.35 వేలకు తీసుకెళ్తే, జిల్లా కేంద్రానికి చెందిన లారీ యజమానులు రూ.42 వేలు అడుగుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల లారీల్లో లోడ్ చేస్తే లారీ అసోసియేషన్‌కు రూ.1220, జిల్లాకు చెందిన లారీల్లో లోడ్ చేస్తే అసోసియేషన్‌కు రూ.220 చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 20 లారీల్లో లోడ్ చేస్తే రోజుకు రూ.20 వేలు ఎలా చెల్లిస్తామని వాపోయారు. ఇతర రాష్ట్రాల విధంగానే రూ.35 వేలకు లోడ్ చేస్తే స్థానిక లారీల్లోనే లోడ్ చేయించి అద్దె చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాము లోడ్ చేసిన వాహనాలను కొందరు లారీ అసోసియేషన్ వారు అడ్డుకుంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తమిళనాడుకు బేళ్లను తరలించేందుకు ఇతర రాష్ట్రాల లారీలు రూ.60 వేలు తీసుకుంటుంటే, స్థానిక లారీ యజమానులు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అద్దె అడుగుతున్నారని పేర్కొన్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందన్నారు. ఇదిలా ఉండగా, డీజిల్ ధర పెరగడం, అద్దె గిట్టుబాటు కావడం లేదని లారీ యజమానులు పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలను అడ్డుకోవద్దని, అలా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సీఐలు సునీల్ కుమార్, కరుణకార్‌రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

అన్నవరానికి దీటుగా గూడెం అభివృద్ధి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
- కలెక్టర్‌తో కలిసి వ్రతమండపం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరానికి దీటుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన వ్రతమండపాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడెం సత్యదేవుడి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే కార్తికపౌర్ణమి వరకు కాటేజీల నిర్మాణంతోపాటు గూడెం గోదావరి నదీతీరం వద్ద స్నానఘట్టాలు నిర్మిస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఈవో శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. వ్రతమండప దాతలను సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వ్రతమండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గూడెంలో భక్తుల రద్దీ

కార్తికమాసం సందర్భంగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 534 జంటలు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

‘గిరిజన విద్యార్థులపై సవతి ప్రేమ’

నార్నూర్: ఏజెన్సీలో ఆదివాసీ గిరిజన విద్యార్థులపై ఐటీడీఏ అధికారులు సవతి ప్రేమ చూపిస్తున్నారని రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ తెలిపారు. గాదిగూడ మండలంలోని పున్నగూడ, రుప్పాపూర్, శివనూర్, అల్లిగూడ, సెడ్వాయి కొలాంగూడ, మారేగాం, హీరాపూర్, చిన్నకుండి, కొత్తపల్లి(జి) గ్రామాల్లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావుతో కలిసి ఆదివారం పర్యటించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మారుమూల మండలం కావడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంపై అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు ఏడు పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో వందకు పైగా విద్యార్థులు నిరక్ష్యరాసులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లు ఉన్నచోట పాఠశాల భవనాలు లేవన్నారు. భవనాలు ఉన్న చోట ఉపాధ్యాయులు లేరన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలన్నారు. వారివెంట తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆందోళనలో ‘ప్రైవేట్’ గార్డులు

- విధుల్లోకి తీసుకోని యాజమాన్యం
- ముగిసిన కాంట్రాక్టర్ కాలపరిమితి



మందమర్రిలోని సింగరేణి ఎస్అండ్‌పీసీ ఆఫీస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని 46 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం విధులకు తీసుకోవడం లేదు. సుమారు 15 రోజులుగా వారు ఆందోళన చెందుతున్నారు. ఇదివరకు వారికి పనులు చెప్పిన కాంట్రాక్టర్ కాల పరిమితి గతనెల 27తో ముగిసింది. అంతకుముందే యాజమాన్యం మరో కాంట్రాక్టర్ కోసం టెండర్ పిలువగా మురళి మ్యాన్‌పవర్ ఏజెన్సీకి టెండర్ దక్కినట్లు సమాచారం. టెండర్‌దారు ఎలాంటి చార్జ్ తీసుకోకపోవడంతో ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల విధుల పంపిణీ జరగలేదు. గతంలో సింగరేణి యాజమాన్యం సీఐఎస్ఎఫ్ సిబ్బంది తొలగించిన అనంతరం టెండర్ ద్వారా నాలుగేళ్ల క్రితం 22 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను తీసుకుంది. మొదట సేఫ్ సెక్యూరిటీ, తర్వాత రెడ్డి బ్రదర్స్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. వారి కాలపరిమితి పూర్తవడంతో కొత్తవారికి ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఎవరూ రావడం లేదు. ఇదిలా ఉంటే, కొత్త కాంట్రాక్టర్ వచ్చేవరకు రెడ్డి బ్రదర్స్‌కే కేటాయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తొలగించే ప్రయత్నం!

సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ సెక్యూరిటీని తొలగించే ప్రయత్నంలో భాగంగానే వారిని విధులకు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏరియాలో ఫీమేల్ మజ్దూర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రైవేట్ సెక్యూరిటీ స్థానంలో వారినే భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.